


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 202 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 28 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :202 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 28 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## కమణీయం సీతారాముల కల్యాణం

భక్తజనసంద్రమైన భద్రాచలం

మిలమిల మెరిసిపోయిన మిథిలా స్టేడియం

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



వివరాలు 2లో..



### బాలరాముడికి సూర్య తిలకం

- అయోధ్యలో అద్భుత దృశ్యం
- స్వామివారి నుదుటిని తాకిన కిరణాలు
- అంబరాన్నంటిన శ్రీరామనవమి వేడుకలు



## ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

- ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్
- ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి
- చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం
- ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక
- అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య

మిగతా 2లో



## ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

### చైనా హ్యాకర్ల కొత్త ఎత్తుగడ

- ప్రపంచ టెలికాం నెట్‌వర్క్‌లే లక్ష్యంగా చైనా హ్యాకర్ల దాడి
- నెట్‌వర్క్‌లలో 'డిజిటల్ స్లీపర్ సెల్స్' తరహా మాల్‌వేర్ చొప్పిస్తున్న వైనం
- బీపీఎఫ్‌డోర్ అనే లినక్స్ ఆధారిత మాల్‌వేర్‌తో రహస్య గూఢచర్యం
- దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 నివేదికలో కీలక హెచ్చరికలు

మిగతా 2లో

## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

### ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు


- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం
- సామాన్యుడికి మేలు చేసే నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు న్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్

మిగతా 2లో

## నాపై హత్యాయత్నం జరిగింది



- ఆకివీడులో రామాలయం వద్ద రఘురామపై దాడికి యత్నం
- ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అన్న రఘురామ
- వేరే మతం ముసుగులో ఉన్నవారు దాడి చేశారని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**శ్రీరామనవమి పర్వదినాన ఆకివీడులోని పెదపేట రామాలయం వద్ద ఓ వర్గానికి చెందిన వ్యక్తులు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఏపీలో కలకలం రేపింది. ఈ దాడిపై రఘురామ స్పందిస్తూ... తనపై జరిగిన దాడి కేవలం ఆకస్మికం కాదని, అది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అని ఆరోపించారు. నిన్న సాయంత్రమే బయటి ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆకివీడుకు చేరుకున్నారని, రాళ్లు, కత్తులు, మేకులతో తనపై దాడి చేసేందుకు వాళ్లు వచ్చారని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో



## సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

### టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలని దిశానిర్దేశం

పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష

ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ

ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం

చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల

మిగతా 2లో

## ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

### ఇజ్రాయెల్ మంత్రి హెచ్చరిక

- పౌర ప్రాంతాలపై దాడులు వద్దని కోరుతున్నామన్న కాట్జ్
- ఇరాన్ మాత్రం దాడులు ఆపడం లేదని ఆగ్రహం
- అందుకే దాడులు తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరిక

మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

### ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ ధన్యవాదాలు

- పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై పూర్తిగా ఎక్సైజ్ సుంకం రద్దు
- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయమన్న లోకేశ్
- ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుందని ప్రశంస

**పెన్ పవర్ డెస్క్:**పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట



మిగతా 2లో

## వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- సీతారాముల కల్యాణం నిర్వహించిన వైసీపీ నేతలు
- వేడుకల్లో పాల్గొన్న సజ్జల, వెల్లంపల్లి తదితర నేతలు
- శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు అంటూ జగన్ ట్వీట్

**పెన్ పవర్ డెస్క్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల



మిగతా 2లో

## మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

### కేంద్ర మంత్రి కీలక ప్రకటన



- దేశంలో లాక్‌డౌన్ వార్తలు పూర్తిగా అవాస్తవమన్న కేంద్రం
- ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి
- అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ కొరతతో పెరిగిన ఊహాగానాలు
- ప్రధాని వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ప్రభుత్వ వర్గాల వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:** దేశవ్యాప్తంగా మరోసారి లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియా సహా, కొన్ని వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# తెలుగు సినీ రంగ అగ్రనటుడు

చిత్తూరు నాగయ్య (1896– 1973) తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిన మహా నటుడు. భక్తి ప్రధాన పాత్రలు, చారిత్రక, సామాజిక పాత్రల్లో ఆయన అపూర్వమైన ప్రతిభను కనబరిచారు. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు నాట అగ్రశ్రేణి కళాకారుడిగా గుర్తింపు పొందారు. చిత్తూరు నాగయ్య 1896 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, రేపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య శర్మ. చిన్ననాట నుండే నాటకాలపై ఆసక్తి పెంచుకున్న నాగయ్య, విద్యాభ్యాసం పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం చేపట్టారు. అయితే, ఆయన హృదయం కళలపైనే ఆసక్తిగా ఉండడంతో, ఉద్యోగాన్ని వదిలేసి నాటక రంగంలో ప్రవేశించారు. సంగీతంపై గాఢమైన ప్రేమ ఉండటంతో కర్ణాటక సంగీతం లో శిక్షణ తీసుకున్నారు. నాగయ్య తన నటనా ప్రస్థానాన్ని నాటకాల ద్వారా ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బిల్హ – రంగనాథం వంటి నాటకాలలో ఆయన అద్భుతంగా నటించి, ప్రేక్షకుల అభిమానం పొందారు. ఆయన భావ ప్రదర్శన, సంభాషణా నైపుణ్యం, సంగీత ప్రతిభ నటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాటక రంగంలో అందరినీ ఆకట్టుకున్న నాగయ్య, సినిమాల వైపు మళ్ళారు. 1937లో "గృహలక్ష్మి" చిత్రంతో నాగయ్య సినీ రంగంలో అడుగు పెట్టారు. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆయన ప్రధానంగా పౌరాణిక, భక్తి ప్రధాన, చారిత్రక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి, తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి ఎదిగారు. నాగయ్య నటించిన కొన్ని అత్యంత ప్రఖ్యాత చిత్రాలలో…భక్త పోతన (1942)లో పోతనగా ఆయన నటన అపురూపం, త్యాగయ్య (1946)లో త్యాగరాజ స్వామిగా ఆయన జీవించేసినంత గొప్ప నటన, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1939)లో శ్రీవేంకటేశ్వరునిగా విశిష్టమైన నటన మరపు రానివి. అలాగే భక్త రామదాసు (1943)లో భక్త రామదాసుగా నటించి ప్రేక్షకుల గుండెల్లో నిలిచి పోయారు. యోగి వేమన (1947)లో యోగి వేమన పాత్రలో అద్భుతమైన అభినయం చూపారు. స్వర్గసీమ (1945)లో సామాజిక చిత్రంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించారు. మల్లీశ్వరి (1951)లో ముఖ్యపాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. దేవదాసు (1953)లో కీలకపాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు."త్యాగయ్య" చిత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ఇది భారతీయ సినీ చరిత్రలో తొలి జీవిత చరిత్ర (బయోపిక్) సినిమా గా చరిత్ర సృష్టించింది. నాగయ్య గొప్ప గాయకుడు కూడా. ఆయన తన సినిమాల్లో చాలా పాటలు స్వయంగా పాడేవారు. ముఖ్యంగా భక్తి గీతాలు, కీర్తనలు ఆయన గొంతులో అద్భుతంగా ప్రతిధ్వనించేవి. నాగయ్య నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా గుర్తింపు పొందారు. ఆయన స్వీయ దర్శక త్వంలో "త్యాగయ్య" సినిమాను నిర్మించి, జాతీయ అవార్డు గెలుచు కున్నారు. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో సంగీత కారుల జీవితాలను ఆధారంగా తీసుకుని నిర్మించిన తొలి చిత్రం. సినిమారంగంలో గొప్ప స్థాయికి ఎదిగిన నాగయ్య, జీవితాంతం కళా రంగానికి అంకిత మయ్యారు. అయితే, జీవితాంతం సినిమా రంగానికే అంకితమై ఉన్నా, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ 1973 డిసెంబర్ 30న, చెన్నైలో మరణించారు. తెలుగు సినిమాకు భక్తి రస ప్రధాన పాత్రలలో మూడో కన్నుగా నిలిచారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ నటుల్లో ఒకరు. సినిమా ద్వారా సంగీతాన్ని ప్రజలకు చేరువ చేశారు. నేటికీ ఆయన నటన, గానం మనసులో నిలిచేలా ఉంటుంది. చిత్తూరు నాగయ్య తెలుగులో తొలి మహా నటుల్లో ఒకరు. భక్తి ప్రధానమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, సినీ రంగంలో తనదైన సుస్థిరమైన స్థానం సంపాదించారు. నటన, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం ? ఇలా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

# కమణీయం సీతారాముల కల్యాణం

భద్రాచలం: దక్షిణ అయోధ్య భద్రాచలంలోని మిథిలా స్టేడియం లో రాములోరి పెండ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ సుట్టం పారంభమైంది. భక్తజనం జయజయధ్వానాల మధ్య సీతమ్మను జగదానందకారకుడైన శ్రీరాముడు వరణ యమాడాడు. అభిజిత్ మూహూర్తంలోమధ్యాహ్నం 12గంటలకు సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్య చారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అధ్యకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి అమ్మ వార్త కళ్యాణం కనులారా తిలకించేందుకు లక్షల మంది జనం మిథిలా స్టేడియానికి తరలిరావడం తో పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఆ ప్రాంతమంతా జైశ్రీరామ్' నినాదంతో మార్మోగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి సీఎం రేవంత్ రెడ్డి. గీత దంపతులు వస్త్రాలు, ముత్యాల తలంబ్రా లు సమర్పించారు. ఈ కళ్యాణోత్స వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వ రరావు, పొంగులేటి శ్రీనివాస్లి, అడ్లూరి లక్ష్మణ్,. కొండా సురేఖ. ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాలరాముడికి సూర్య తిలకం**

అయోధ్య: బాలరాముడు కొలువైన అయోధ్యలో శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృ తమైంది.

మధ్యాహ్నం సరిగ్గా 12గంటలకు స్వామి వారికి సూర్యకిరణాల తో తిలకం దిద్దారు. నాలుగు నిమిషాల పాటు సూర్యకిరణాలు రామ్లల్లా నుదుటిపై ప్రసరించాయి. బాల రాముడి దర్శనానికి దేశనలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో అయోధ్యలోని భవ్య రామ మందిరం భక్తుల తో కిటకిటలాడుతోంది. అంతకుముందు సరయూ నదిలో పుణ్యస్నానాలు చేసి ఆచరించారు. కాగా.. ఇది రామ్లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన వచ్చిన మూడో శ్రీరామ నవమి కావడం గమనార్హం.

# ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

ప్రపంచవ్యాప్తంగా టెలికాం మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చైనాకు చెందిన ఓ హ్యాకింగ్ గ్రూప్ అత్యంత ప్రమాదకరమైన సైబర్ దాడులకు పాల్పడుతోందని ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ హ్యాకర్లు దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యం కోసం టెలికాం నెట్‌వర్క్‌లలోకి రహస్యంగా మాల్‌వేర్‌ను చొప్పిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 (=ఖజూఅఎ7) తన నివేదికలో హెచ్చరించింది. ఈ హ్యాకర్లు "డిజిటల్ స్లీపర్ సెల్స్" తరహాలో పనిచేసే అత్యాధునిక టూల్స్‌ను వాడుతున్నారని నివేదిక తెలిపింది. కెర్నల్-స్థాయి ఇంప్లాంట్లు, పాసివ్ బ్యాక్‌డోర్స్ వంటివి నెట్‌వర్క్‌లలో చాలాకాలం పాటు గుర్తించబడకుండా దాగి ఉండేందుకు వీలు కల్పిస్తాయి. తద్వారా, వ్యవస్థలను నిశ్శబ్దంగా పర్యవేక్షిస్తూ, తమ ఉనికి బయటపడకుండా హ్యాకర్లు యాక్సెస్‌ను కొనసాగిస్తారు. ప్రభుత్వ, కీలక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడమే వీరి లక్ష్యమని నిపుణులు భావిస్తున్నారు. ఈ దాడుల్లో "బీపీఎఫ్‌డోర్" అనే లినక్స్ ఆధారిత బ్యాక్‌డోర్‌ను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్టు రాపిడ్7 గుర్తించింది. ఇది సిస్టమ్ కెర్నల్‌లోనే దాగి ఉంటూ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను గమనిస్తుంది. డేటా ప్యాకెట్లలో ఒక ప్రత్యేకమైన రహస్య సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ఇది యాక్టివేట్ అవుతుంది. సిస్కో, ఫోర్టినెస్, వీఎమ్‌వేర్, ఇవాంటీ వంటి ప్రముఖ కంపెనీల సిస్టమ్స్‌లోని లోపాలను హ్యాకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.కేవలం ఒక్కో సిస్టమ్‌ను హ్యాక్ చేయడమే కాకుండా, టెలికాం నెట్‌వర్క్‌లకు గుండెకాయలాంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పట్టు సాధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని నివేదిక స్పష్టం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థల వెన్నెముకనే లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఈ దాడులు అత్యంత ప్రమాదకరమని సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో డేటా ప్రవాహాన్ని పర్యవేక్షించడం, సేవలకు అంతరాయం కలిగించడం వంటివి చేసే అవకాశం హ్యాకర్లకు లభిస్తుంది.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.

అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా

నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

- మొదటి పేజి తరువాయి

తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. దేశంలో లాక్‌డౌన్ విధించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించే లక్ష్యంతో ఆయన ఈ స్పష్టతనిచ్చారు.

"భారత్‌లో లాక్‌డౌన్ విధిస్తారనే వదంతులు పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వ పరిశీలనలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదు. ఇలాంటి సమయంలో ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐక్యంగా ఉండటం ముఖ్యం. వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం బాధ్యతారహితమైన చర్య, హానికరం" అని హర్దీప్ సింగ్ పురి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధనం, సరఫరా వ్యవస్థలు, నిత్యావసరాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు ఇంధనం, ఇతర నిత్యావసరాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు, దేశంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై నెలకొన్న కొన్ని వార్తల నేపథ్యంలో లాక్‌డౌన్ విధించవచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి తోడు 2020లో విధించిన లాక్‌డౌన్‌కు ఆరేళ్లు పూర్తయిన సందర్భం కూడా కావడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది.అంతేగాక పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంటులో మాట్లాడుతూ "సన్నద్ధంగా ఉండాలి" అని చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అన్వయించారు. కోవిడ్ తరహా సన్నద్ధత అంటే పరిపాలనాపరమైన ముందుజాగ్రత్త చర్యలే తప్ప, ప్రజల కదలికలపై ఆంక్షలు విధించడం కాదని ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఈ క్రమంలోనే లాక్‌డౌన్‌పై వస్తున్న అన్ని రకాల ఊహాగానాలకు తెరదించుతూ కేంద్ర మంత్రి తాజాగా ఈ ప్రకటన చేశారు.

# కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

- మొదటి పేజి తరువాయి

చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నా రు."కఠినమైన, సవా లుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటప డుతుంది. నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం.ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరపున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది.నేడు అనేక దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

# నాపై హత్యాయత్నం జరిగింది

- మొదటి పేజి తరువాయి

వందేళ్ల చరిత్ర ఉన్న ఈ రామాలయాన్ని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, వారు హిందువులే అయినప్పటికీ వేరే మతం ముసుగులో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయాన్ని శుభ్రం చేయడానికి కూడా వారు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. దాడి చేసిన వారు రామ భక్తుల వేషంలో ఉండి ఒక్కసారిగా విరుచుకుపడ్డారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని వెల్లడించారు. లేనిపక్షంలో పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. ఇలాంటి వికృత చేష్టలను ఆదిలోనే అరికట్టకపోతే అవి సమాజానికి పెద్ద ముప్పుగా మారతాయని రఘురామ హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించానని, వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ తెలిపారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, గల్ఫ్, ఇజ్రాయెల్ దేశాల్లో పౌర ప్రాంతాలపై క్షిపణి దాడులు చేయవద్దని తాను, ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ ఇరాన్‌ను హెచ్చరించినట్లు తెలిపారు. కానీ ఇరాన్ మాత్రం పౌర ప్రాంతాలపై దాడులు ఆపడం లేదని మండిపడ్డారు. పదేపదే హెచ్చరించినప్పటికీ ఇరాన్ దాడులు ఆపడం లేదని, ఈ నేపథ్యంలో ఆ దేశంపై దాడులను తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరించారు. ఇరాన్‌లోని మరిన్ని ప్రాంతాలు లక్ష్యంగా దాడులు చేస్తామని పేర్కొన్నారు. ఈ యుద్ధ నేరానికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వ్యాఖ్యానించారు.

**క్షిపణి తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం**

టెహ్రాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఈరోజు తెలిపింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలోని క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్లు వెల్లడించింది. కాగా, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలవుతోంది. ఈ కాలంలో ఇరాన్‌పై 850కి పైగా తోమహక్ క్షిపణులను అమెరికా ప్రయోగించింది.

# వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- మొదటి పేజి తరువాయి

అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.

# పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

- మొదటి పేజి తరువాయి

కల్పించేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.10 తగ్గించారు, డీజిల్ పై పూర్తిగా రద్దు చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుంది. ఇంధన కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నుంచి ప్రజలకు ఉరటనిస్తూ ఇంధన ధరలు పెరగకుండా భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని మోదీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

# ఘనంగా పాఠశాల వార్షికోత్సవ సంబరాలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 27 :** పెద్దాపురం మండలం కట్టమూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పాఠశాల వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులే రేపటి భారత భాగ్యవిధాతలని, వారికి నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను బోధించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడంలో వార్షికోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఉప్పిటి ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ గుత్తుల సూర్యావతి శ్రీనివాస్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎలిశెట్టి నాని, సానిపిన రామకృష్ణ, ఉప విద్యాశాఖాధికారి ఈరంకి ప్రభాకర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం పెన్ పవర్ మార్చి 27 :**కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఈనెల 29న జరగనున్న వేడుకలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలోనూ ఉత్సాహంగా జరపాలని కోరారు. తెలుగుదేశం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తూర్పులంక మార్గం.. రమణీయ దృశ్యం..!


- కిలోమీటరు మేర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోన్న గులాబీ ట్రంపెట్ చెట్లు..
- రోడ్డుమార్గమంతా తీవాచి పరిచినట్లు చెర్రీ బ్లోసమ్స్ పూలు..
- సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలుస్తోన్న తూర్పులంక - గుండెపూడి రోడ్డు..

**అల్లవరం,పెన్ పవర్, మార్చి29:**ఓవైపు మేజర్ డ్రైన్... దాని పొడవునా ఏపుగా పెరిగిన చెట్లు.. ఇదీ మొన్నటి వరకు అందరికీ కనిపించిన దృశ్యం.. కానీ ఇప్పుడు ఆ రోడ్డు మార్గం ఓ నందన వనం.. రోడ్డంతా పూలవనం.. అటువైపుగా వెళ్లేవారంతా ఈ రమణీయతకు ఎత్తిన తల దించకుండే వళ్లేంత ఆందమైన శాదృశ్యం.. గత కొన్ని రోజులుగా అల్లవరం మండలంలోని తూర్పులంక – గుండిపూడి రోడ్డులో కనిపిస్తోన్న చూపుతిప్పుకోలేనంతగా ఆకర్షించే ఆ చెట్ల సొబగులు.. ఈ అందాలను కనులారా చూస్తూ మైమరిపోయేలా చేస్తోన్న ఈ చెట్లకు పూస్తున్న పూలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండింగ్ అవుతున్నాయి... ఇంతకీ ఎంటీ ఆప్రత్యేకత అనుకుంటున్నారా.. గులాబీ వర్ణంలో ట్రంపెట్‌ను పోలిన రూపాన్ని పోలి కంటికి అంతే ఆకర్షణీయంగా కనిపించే ట్రంపెట్ చెట్ల పుష్పాలు.. ఈ అందాలు కేవలం కొన్ని రోజులు మాత్రమే కనిపించేవి అంటున్నా వసంతకాలాన మార్చి, ఏప్రిల్ మాసంలో కనువిందు చేస్తాయంటున్నారు..

**పూలవనంగా మారిన రోడ్డు...**


అల్లవరం మండల పరిధిలోని తూర్పులంక నుంచి గుండెపూడి వైపుగా ఉన్న కౌశిక మేజర్ డ్రైన్ రోడ్డు పొడవునా ఈ చెట్లు ఉన్నాయి.. అయితే ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఈ చెట్లు విరపూయడంతో ఈరోడ్డు మార్గం అంతా ప్రకృతి హారంగా మారింది.. దీంతో ఈ సుందర దృశ్యాలు కొంత మంది చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ వీడియోలు వైరల్ అయ్యాయి.. దీంతో అనేక మంది ఈ రోడ్డుమార్గంకు వచ్చి వీడియోలు తీస్తు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేస్తుండడంతో ప్రస్తుతం ఈ సుందర దృశ్యాలు ట్రెండింగ్ గా మారాయి... చూపు తిప్పుకోలేనంత అందంగా ఈ రోడ్డు మార్గం మారడంతో ఈ ప్రకృతి రమణీయతను కళ్లారా చూసేందుకు వరుస కడుతున్నారు..

**వసంతకాలంలో ప్రత్యేక ఆకర్షణగా ట్రంపెట్ పూలు...**



భారతదేశంలోని వివిధ నగర వీధులను రమణీయమైన గులాబీ తివాచీ పరచిన మార్గాలుగా మార్చేగులాబీ ట్రంపెట్ చెట్లకు శాస్త్రీయ నామం టబెబుయా రోసియా.. వార్షిక కాలానికి పుష్పించే ఈ పూలు వసంతమాసంలో కనిపిస్తాయి..

ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలల మధ్య పూచే ఈ పూలు కేవలం కొన్ని




రోజులు మాత్రమే ఉండి రాలిపోతాయి.

ఈ చెట్లు తమ ఆకులను రాల్చి, ప్రకాశవంతమైన గులాబీ రంగులో కనిపించగా ఆకాశాన పందిరివేసిన చందంగా భలే చూడచక్కగా ఉంటాయి. వీటిని "ఇండియన్ చెర్రీ బ్లోసమ్స్" లేదా "సకురా మలేషియా" అని పిలుస్తారు.

టబుబియా రోసియా మధ్య, దక్షిణ అమెరికాకు చెందిన జాతిగా దీనికి పేరుండగా ముఖ్యంగా బెంగళూరు, కొచ్చి వంటి నగరాల్లో బాగా కనిపిస్తుంటాయి.. వసంతానికి సూచికగా ఈ చెట్లు అందాలు కనిపిస్తూ రహదారులను మరింత ఆకర్షణీయంగా మార్చుతున్నాయి..

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో దివ్య కళ్యాణం



స్వామివారి కల్యాణ మహోత్సవంలో అత్యధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 27:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఉన్న ప్రాచీన శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో కళకళలాడింది. స్వామివారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అలంకరించాయి. తెల్లవారుజామునే ఆలయ ప్రాంగణంలో మంగళవాయిద్యాల నడుమ ప్రారంభమైన కార్యక్రమాలు భక్తుల హృదయాలను ఆకట్టుకున్నాయి. జగన్మోహిని కేశవ స్వామి మాలలు ధరించిన స్వాములచే నిర్వహించిన గ్రామోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ వీధుల గుండా స్వామివారి ఊరేగింపు సాగగా, భక్తులు హారతులు పట్టి, భజనలు చేస్తూ పాల్గొన్నారు.సాయంత్రం ఆలయ సన్నిధిలోని కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం వేదమంత్రాల నడుమ ఘనంగా జరిగింది. అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీతారామాచార్యులు, వేద పండితులు వెంకట అవధాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దివ్య కల్యాణంలో ప్రత్యేక పూజలు, హోమాలు, మంత్రోచ్చారణలు జరిగాయి. స్వామివారికి అర్చనలు నిర్వహించి, సంప్రదాయ పద్ధతిలో కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి బి. వెంకట రమణమూర్తి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు కూడా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

## కిర్లంపూడి మండలంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు






**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 27:** శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని పలు రామాలయాల్లో సీతారామ కళ్యాణం ఎంతో వైభవంగా జరిపించారు. మండలంలో పలు రామాలయాల్లో నిర్వహించిన సీతారామ కళ్యాణోత్సవాలకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కాకినాడ టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి సీతారామ కల్యాణోత్సవాలలో పాల్గొన్నారు. ముక్కోల్లు గ్రామంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు దంపతులు బూరుగుపూడి గ్రామంలో మాజీ ఎంపిటిసి పాటంశెట్టి రవి దంపతులు , రాజుపాలెం గ్రామంలో మాజీ ఎంపీటీసీ గొడె దొరబాబు,తులసి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముని కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. రాజుపాలెం గ్రామంలో ఉన్న సీతారామాంజనేయ ఆలయ ధర్మకర్తలు కొల్లా రాజారావు, గొడె ఏసుబాబు, కంఠా చక్రధర్ రావు ,రాజశేఖరరెడ్డి వేధ పండితులు తేజో మూర్తుల జగదీష్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమం లో ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు పలువురు భక్తులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ధర్మవరం పద్మశాలీల రామాలయంలో వెండి కీరిటాన్ని బహుకరించిన ముదునూరి

### రూ.1లక్షా 2 వేల రూపాయల విలువ చేసే వెండి కీరిటం బహుకరణ.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,మార్చి 27:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని పలు రామాలయాల్లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు,నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పాల్గొని సీతారాములని దర్శించుకుని ఆయా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మవరం గ్రామంలో ఉన్న పద్మశాలీల రామాలయంలో సీతారాముల వారికి ఒక లక్షా రెండు వేల రూపాయలతో విలువ చేసే వెండి కీరాటాన్ని బహుకరించారు.బొల్లు వారి రామాలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్నదానానికి మురళీ కృష్ణంరాజు 5 వేల రూపాయలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజుని పలు రామాలయాల్లో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ శ్రీ సీతారాముల ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పోకనాటి శేషయ్య, దాడి పుత్తయ్య, నార్లంక వెంకన్న బాబు, గంటా బుజ్జిబాబు,తోలేటి శేఖర్,సుంకర తమ్మారావు, కాకి చక్రరావు, పలివెల లక్ష్మీనారాయణ, పలివెల చిట్టిబాబు, మొండి సుభాష్, మొండి రాజు,కాకి సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## వాడపల్లి కళ్యాణోత్సవాలకు మంత్రి ఆహ్వానం





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 27:**కోనసీమలోని ప్రసిద్ధ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరగనున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారికంగా ఆలయ డిప్యూటీ కమిషనర్ , కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు అమరావతిలో మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కోనసీమ ప్రాంతానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను పెంచే ఈ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశమున్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.
భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలలో సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఆలయ పరిసరాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమే కాకుండా, ప్రాంతీయ పర్యాటక అభివృద్ధికి కూడా దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు.

## వాడపల్లివెంకన్నకళ్యాణోత్సవాలు నేడు ప్రారంభం


- ఏడు రోజుల పాటు అంగరంగ వైభవం






**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 27:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఏడు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల కోసం దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.చైత్ర శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు జరిగే ఈ మహోత్సవాలకు ఈసారి భారీగా భక్తులు తరలి రానున్నారని అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పించామని పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు తెలిపారు.
జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే బండారు
సత్యానందరావు ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమన్వయం చేసినట్లు పేర్కొన్నారు.మార్చి 28న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమై, 29న ధ్వజారోహణం, స్వామివారి దివ్య కళ్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. 30న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 31న సదస్యం, ఏప్రిల్ 1న జల విహారోత్సవం, 2న చక్రస్నానం, 3న పుష్పోత్సవంతో మహోత్సవాలు ముగియనున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, తాగునీరు, ప్రసాదాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.

# ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి దివ్య కళ్యాణ మహోత్సవాలు వైభవంగా




స్వామి వారి గ్రామోత్సవంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 27:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని వేంచేస్తున్న అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం కేశవ స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.ఉత్సవాలలో భాగంగా స్వామివారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా సాంప్రదాయబద్ధంగా అలంకరించి, వేదమంత్రాల నడుమ కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు వాడపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. మంగళవాయిద్యాలు, హారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.కళ్యాణోత్సవాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి దివ్య దర్శనం, కళ్యాణోత్సవంలో పాల్గొనడం తమకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని భక్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించబడింది. శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానంలోస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవ గ్రామోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో జగన్మోహిని కేశవ స్వామి మాలలు ధరించిన స్వాములు స్వామివారి ఊరేగింపు లో పాల్గొన్నారు.స్వామి వారి ఉత్సవం విశేషంగా ఆకట్టుకుని భక్తులను భక్తి పరవశంలో ముంచెత్తింది.

## ర్యాలి గ్రామంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం





పల్లకి సేవలో సీతారాములు ఊరేగింపు

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 27:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలిచిన గౌడ రామాలయం వద్ద శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ సన్నిధిలో జరిగిన ఈ వేడుకలో పెళ్లి పీటలపై కూర్చున్న దంపతులు పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.
అర్చకులు తుట్టగుంట వీర వెంకట సత్యనారాయణ మూర్తి చార్యులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం గౌడ సంఘ పెద్దలు, యువత ఆధ్వర్యంలో గ్రామంలో పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ డప్పులు, బ్యాండ్ మేళాలతో ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.
ఈ సందర్భంగా స్వామివారి పల్లకి సేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి స్వయంపాకం సమర్పించారు. గ్రామం మొత్తం భక్తి భావంతో కళకళలాడింది.

# శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో జనార్ధనస్వామి

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;**నారద ప్రతిష్టిత నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారు పునర్వసు నక్షత్రం, శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ పుష్ప, తులసీ మాల అలంకరణలతో నయన మనోహరమైన స్వామివారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



## రామాలయానికి ఉత్సవ విగ్రహాలు బహుకరణ




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;**ఆలమూరు మండలం బడుగువానిలంక కొత్తూరు రామాలయానికి ఆ గ్రామానికి చెందిన "అమ్మ ఫ్లవర్ డెకరేషన్" యజమాని దూలం లోకేష్ లావణ్య దంపతులు ఉత్సవ విగ్రహాలను అందజేశారు. రామ, లక్ష్మణ, సీత, ఆంజనేయ స్వామి వార్ల 22 కేజీల విగ్రహాలను శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం ఆ దంపతులు స్వామి వారి కళ్యాణం జరిపించి ఆలయానికి అందజేశారు. సుమారు రూ.40 వేలు విలువైన విగ్రహాలను అందజేసిన లోకేష్ దంపతులను ఆలయ కమిటీ, గ్రామస్తులు అభినందించారు.

## ఆలమూరు ఏఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన స్వామి

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;**ఆలమూరు స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్(ఏఎస్ఐ)గా డి. సుబ్రహ్మణ్యస్వామి (స్వామి) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కాలంలో హెచ్సీలకు పదోన్నతులు కల్పించడంలో భాగంగా ఏఎస్ఐ గా స్వామి కి పదోన్నతి లభించింది. ఆలమూరు ఏఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో స్వామిని ఇక్కడే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డిఎస్ స్వామి శుక్రవారం ఆలమూరు ఎఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.ఏఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన స్వామిని రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యా సాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్ తో పాటు పలువురు సిబ్బంది అభినందించారు.




## మాజీ సర్పంచ్ ప్రసన్నకుమారి మృతి




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;**ఆలమూరు మండలం పెదపళ్ల మాజీ సర్పంచ్ అల్లూరి వీర ప్రసన్నకుమారి (72) శుక్రవారం మృతి చెందారు. ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1995-2001 మధ్యకాలంలో పెదపల్ల సర్పంచిగా పనిచేశారు. ఆలమూరు మాజీ ఎమ్మెల్యే వివిఎస్ చౌదరి, రాజమండ్రి పార్లమెంట్ సభ్యులు ఎస్బీకే సత్యనారాయణరావుల సమయంలో పెదపళ్లలో కళ్యాణ మండపానికి నిధులు సమకూర్చి నిర్మాణం చేపట్టడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అలాగే గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి సర్పంచ్ గా తన ప్రత్యేకతను చాటుకున్నారు. మాజీ సర్పంచ్ ప్రసన్నకుమారి మృతి పట్ల కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తో పాటు పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు.

కొత్తపేట డిఎస్పి మురళీమోహన్ రావు, హైవే పిడి కృష్ణమూర్తి.




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;** జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ రావు, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ బి కృష్ణమూర్తి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ నుండి మడికి వరకు 216 (ఏ) జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను వారు క్షేత్రస్థాయిలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి నరేష్ తో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా జొన్నాడ - కోటిపల్లి ఏటు గట్టు వద్ద, జొన్నాడ ఆంజనేయస్వామి వారి ఆలయం, మూలస్థాన అగ్రహారం సెంటర్, చొప్పెల్ల లాకులు, చెముడులంక, మడికి మొత్తం ఆరు బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలలో గల కారణాలు, నివారణా చర్యలపై చర్చించారు. జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇలాంటి చోట్ల ప్రమాద నివారణా చర్యలను తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే జాతీయ రహదారుల జంక్షన్ల వద్ద సెంటర్ లైటింగ్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముఖ్యంగా జొన్నాడ ఏటిగట్టు వద్ద ప్రమాదాలను నివారించేందుకు అవసరం మేరకు రెండు రోడ్ల మధ్య మార్గాన్ని మూసివేయాలని, లేదా దానికి తగిన ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా సెంటర్ లైటింగ్ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల టీం లీడర్ ఏ శ్రీనివాసు, ప్రాజెక్ట్ మేనేజర్ కే బాలసుబ్రమణ్యం, రూట్ మేనేజర్ పి రమేష్, టోల్ మేనేజర్ కె వి వి ఎస్ ఎన్ రెడ్డి, పోలీస్, హైవే సిబ్బంది పాల్గొన్నారు.



## సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి





- చోడవరంలో ఉచిత చలివేంద్రం ప్రారంభం
- వాసం శెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్ మార్చి 27:** సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంపిలుపునిచ్చారు. రామచంద్రపురం రూరల్ పరిధిలోని చోడవరం గ్రామంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని ఆయన నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ, తాగునీటిని ప్రజలకు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన షాలేం క్రీస్తు ఆరాధన మందిరం, జేజేఎం , ఐఓఎం మినిస్ట్రీస్ నిర్వాహకులను, ఇతర దైవ సేవకులను వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. సమాజం పట్ల బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కె ఆశా కుమార్, బ్రదర్ కె సంతోష్ కిరణ్, కె జ్యోతి బాబు, ఎం రాజారావు, కె స్వరూప, కె ప్రదీప్ తదితరులు, స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు. వేసవి కాలంలో ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడే ఈ చలివేంద్రం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సమాజానికి సేవ చేయాలని, ముఖ్యంగా చలివేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలని వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సహకారం, మానవతా విలువలను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 27 :** లోక కల్యాణార్థం ప్రతీ యేటా చైత్ర శుద్ధ నవమి రోజున జరుపుకునే శ్రీరామనవమి వేడుకలు పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ అభిజిత్ లగ్నంలో రామయ్య, జగన్మాత సీతమ్మ మెడలో మాంగళ్యధారణ చేశారు. కన్నుల పండువగా సాగిన స్వామివారి కల్యాణ పర్వాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులు పానకం, వడపప్పును తీర్థప్రసాదాలుగా స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


## పంచలోహ కళ్యాణ విగ్రహాలు బహూకరణ



**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 27:** మండలంలో మల్లేపల్లి గ్రామం నేల కుండీల తోట లో ఉన్న రామాలయానికి శ్రీరామనవమి పురస్కరించుకుని గ్రామానికి చెందిన భక్తులు వల్లభ శెట్టి శీను వీర కుమారి దంపతులు సుమారు లక్ష ఇరవై వేల తో రాముడు సీత లక్ష్మణుడు ఆంజనేయ స్వామి లా పంచలోహాలు కళ్యాణ విగ్రహాలను ఆలయానికి బహూకరించారు ముందుగా విగ్రహాలను భాజా భజంత్రీలు మేళతాళాలతో శ్రీరామ నామ స్వరాలతో గ్రామమంతటా ఊరేగింపుగా తీసుకెళ్లారు అనంతరం ఆలయ ప్రాంగణంలో శీను వీర కుమారి దంపతులు పీటలపై కూర్చుని వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని జరిపించారు ఈ కార్యక్రమములో భారీ సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు

## శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 27:** శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, బిల్డర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ అన్నారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన కిర్లంపూడి ఉట్ల గుడి వీధి రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించడమే కాకుండా, ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీ సీతారాముల వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గ్రామాల్లో ఉన్న అన్ని రామాలయాల్లోనూ శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. శ్రీ రామ నవమి వేడుకలను పురస్కరించుకొని సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాల్లో ఉన్న పలు రామాలయాలను సందర్శించి సీతారాముల వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. బొడ్డేటి వెంకటేశ్వరరావు, దాడి సతీష్ బాబు పలువురు రామాలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉట్ల గుడి రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో జిల్లాపరిషత్ మాజీ ప్రతిపక్షనేత తోట నవీన్ కుమారుడు తోట వరుణ్, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, మాజీ సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు కుర్ల చినబాబు, టిడిపి నాయకులు తూము కుమార్, కాళ్ళ వెంకటేష్, దాడి రాజగోపాల్ పలువురు గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదములు స్వీకరించారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయం, సురంపాలెంలో బంగ్లాదేశ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 27:** ఆదిత్య విశ్వవిద్యాలయం, సూరంపాలెం లో చదువుతున్న బంగ్లాదేశ్ విద్యార్థులు తమ లి56 వ స్వాతంత్ర్య దినోత్సవాన్నిలి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ డిపార్ట్‌మెంట్‌లి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి సీనియర్ మేనేజర్ మొహమ్మద్ షమీమ్ జఫర్, సీనియర్ మేనేజర్ & స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ కాంచనా అవెలా, మరియు మేనేజర్ సయ్యద్ ఘౌసియా సుల్తానా మార్గదర్శకత్వం అందించారు.


ఈ వేడుకల ద్వారా బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటూ, స్వేచ్ఛ కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అలాగే విద్యార్థుల్లో జాతీయ గౌరవం, ఐక్యత మరియు సాంస్కృతిక విలువలను పెంపొందించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

ఈ సందర్భంగా బంగ్లాదేశ్ విద్యార్థులు సంప్రదాయ సంగీతం, నృత్యాలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలతో తమ సంపన్నమైన సంస్కృతిని ఆవిష్కరించారు. ఈ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకుని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కార్యక్రమం అనంతరం బాయ్స్ హాస్టల్ క్యాంటీన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లిబంగ్లాదేశ్ వంటకాల విందులి అందరినీ అలరించింది. విద్యార్థులు మరియు సిబ్బంది కలిసి ఆ భోజనాన్ని ఆస్వాదిస్తూ సాంస్కృతిక ఐక్యతను మరింత బలపరిచారు.

ఈ వేడుకలు ఆదిత్య విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్నేహభావాన్ని ప్రోత్సహిస్తూ, వివిధ దేశాల సంస్కృతులను గౌరవించే తన కట్టుబాటును ప్రతిబింబించాయి.

## శ్రీరాముడి ఆదర్శాలు ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి: డా. అడ్డాల



**కాకినాడ, పెన్ పవర్, మార్చి 27:** అశోక్‌నగర్‌లో జానకిరమ దంపతుల ఆధ్వర్యంలో 13వ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. అడ్డాల మాట్లాడుతూ శ్రీరామనవమి హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగగా పేర్కొన్నారు. చైత్ర శుద్ధ నవమి రోజున శ్రీమహావిష్ణువు ఏడవ అవతారంగా శ్రీరాముడు జన్మించారని, ఇదే రోజున సీతారాముల వివాహం జరిగిన నేపథ్యంలో ఈ పండుగను వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. శ్రీరాముడు ఆదర్శ కుమారుడు, సోదరుడు, రాజుగా నిలిచారని, సత్యవాక్య పరిపాలన, పితృవాక్య పరిరక్షణ, ఏకపత్నీ వ్రతం, ప్రజాహిత పాలన వంటి గుణాలు ప్రతి మనిషి అలవరచుకోవాల్సినవని అన్నారు. అలాగే శ్రీరామనవమి సందర్భంగా చేసే పానకం, వడపప్పు వంటి నైవేద్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సత్య సాహితి, వీరభద్రరావు, అరుణరేఖ, రాధాకృష్ణ, అనిల్, బాలాజీ, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనపై వ్యతిరేకత వైసీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



**మండపేట. పెన్ పవర్. మార్చి 27 :** ఎన్నికలను హామీలను తుంగలోకి నయవంచనకు గురిచేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పార్టీలో చేరికలే ఇందుకు నిదర్శనమని అన్నారు. కపిలేశ్వరపురం మండలంలో పలువురు టీడీపీ కార్యకర్తలు కూటమి పాలనపై అసంతృప్తితో వైసీపీలో చేరినట్లు తెలిపారు. మండల వైసీపీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, తాతపూడి గ్రామ అధ్యక్షుడు భూల వీరబాబు ఆధ్వర్యంలో సుమారు 25 మంది బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన కార్యకర్తలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్, మహిళలకు రూ 1500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ విధానాలు నచ్చక వైసీపీలో చేరినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేసి తోట త్రిమూర్తులను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు శ్రమిస్తామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో కడియాల శ్రీనివాసరావు, జగ్గంశెట్టి వీర రాఘవులు, జగ్గంశెట్టి కుమారస్వామి, గుత్తుల రాంబాబు, గుత్తుల వెంకటేశ్వరరావు, జగ్గంశెట్టి దొరబాబు, సూరంపూడి వెంకటరమణ, బొక్క శివరామకృష్ణ, జిత్తుగా నాగేంద్ర, జగ్గంశెట్టి వీరాంజనేయ సతీష్, టేకి మణికంఠ స్వామి, జగ్గంశెట్టి మహేష్, వాసంశెట్టి నాగేశ్వరరావు, ఇళ్ల శ్రీనివాసరావు, చల్లంగి వెంకన్న, కోడి మహాలక్ష్మి, ఎడ్ల వెంకటేష్, కాశి పెద్దశీను, రాపాక శ్రీను, నేరేడుమిల్లి చిట్టి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ జిత్తుగ వెంకటలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లా వీరబాబు, టౌన్ కన్వీనర్ పిల్లి శీను, సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ, ఐటీ వింగ్ కన్వీనర్ యారమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం సిఐగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ




**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 27 :** పెద్దాపురం నూతన సర్కిల్ ఇనస్పెక్టర్ గా వై.ఆర్.కె. శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పెద్దాపురం, పిఠాపురం, జగ్గంపేట పోలీస్ స్టేషన్లలో సబ్ ఇనస్పెక్టర్ గా, సర్కిల్ ఇనస్పెక్టర్ గా విధులు నిర్వహించి ప్రస్తుతం జగ్గంపేట నుంచి బదిలీపై మళ్ళీ పెద్దాపురం వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక విలేఖరులతో సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సీఐకు పెద్దాపురం ఎస్ఐ వి. మౌనిక, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## మరిడమ్మ సన్నిధిలో వైభవంగా స్వర్ణ పుష్పార్చన



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 27 :** పెద్దాపురం పట్టణంలో కొలువైన మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి స్వర్ణ, రజత పుష్పాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నిత్య కైంకార్యాలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గర్భగుడి నుంచి ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. మండపంలోని ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్టింపచేసి వేదపండితుల పవిత్ర మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, దేవస్థానం సిబ్బంది రమణ, వేద పండితులు నాగదేవర వెంకటశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాద్ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 27:** శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం జగ్గంపేట మండల వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల గ్రామాల్లోని రామాలయాలు ఉదయం నుంచే భక్తులతో సందడిగా కనిపించాయి. భక్తులు రామాలయాలకు విచ్చేసి సీతారామ లక్ష్మణులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా రామాలయాల్లో భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. భక్తులకు ఆలయాల వద్ద పానకం, వడపప్పు ప్రసాదంగా ఇచ్చారు. పలు రామాలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ జగ్గంపేట లోని పలు రామాలయాలకు వెళ్లి సీతారాములను దర్శించి కళ్యాణం తిలకించారు. జగ్గంపేట గెద్దపేటలోని రామాలయంలో కొండ్రోతు మణికంఠ, వేణు కుమారి దంపతులు పీటలపై కూర్చొగా ప్రముఖ పురోహితులు మామిళ్ళపల్లి అయ్యప్ప శర్మ సీతారాముల కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద మహా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

## సైథిల్ పేట శ్రీ సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకలు



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 27 :** సైథిల్ పేట శ్రీ సీతారామాలయంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గతంలో మండపేట మెయిన్ రోడ్డులో ఉన్న తూర్పు కాపు రామాలయాన్ని ఇటీవల రైతు బజార్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయానికి మార్చిన నేపథ్యంలో, ఈ ఏడాది నుంచి ఇక్కడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పర్వదినం సందర్భంగా స్వామివారిని పల్లకిలో ఊరేగించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, విజయలక్ష్మి ఫైనాన్స్ అధినేత కర్రి వెంకటరమణ, వెంకటలక్ష్మి దంపతులు యజమాన దంపతులుగా పీటలపై కూర్చొని కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పానకాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు, పండితులు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రి రామారావు, జొన్నపల్లి సూర్యారావు, దాసరి సత్యనారాయణ, కర్రి చిన్నబాబు, బుసాల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, ముక్కా దాలయ్య, ముక్కా సుబ్రహ్మణ్యం, సదపతి జయబాబు, పిల్లా గణపతి, జొన్నపల్లి సత్తిబాబు, డొంకిన మురళి, అడబాల వీరబాబు, యండపల్లి బుజ్జి, బొండాడ లక్ష్మీనారాయణ, పప్పుల మురళి, మండా వాసు, చింతల వీరబాబు, లంక సత్యనారాయణ, లంక బాబురావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నులు చెల్లించకపోతే చర్యలు తప్పవు




### కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరిక

**మండపేట. పెన్ పవర్.మార్చి 27 :** ఆస్తి పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు స్పష్టం చేశారు. పన్నులు చెల్లించకుండా ఉన్న ఖాళీ స్థలాలను మున్సిపాల్టీ స్వాధీనం చేసుకుని, వాటిపై ప్లెక్సీలు ఏర్పాటు చేసే చర్యలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా సెలవు ఉన్నప్పటికీ, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పట్టణంలో ఆస్తి పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. ముఖ్యంగా మొండి బకాయిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పన్నులు చెల్లించాలని అవగాహన కల్పిస్తూ వసూళ్లు కొనసాగిస్తున్నారు. పట్టణంలోని బకాయిదారుల ఇళ్ళ వద్ద వినూత్న పద్ధతుల్లో సిబ్బంది ప్రచారం నిర్వహిస్తూ పన్నులు చెల్లించాల్సిన అవసరాన్ని వివరించారు. ఇదిలా ఉండగా ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం అందుబాటులో ఉందని, దీనికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని కమిషనర్ తెలిపారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

## ఘనంగా సాయినాథునికి చందనోత్సవం



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 27:** తర్వాణీపేటలో వేంచేసియున్న సాయిబాబా వారి చిత్రపటాన్ని భక్తులు సాయి నామస్మరణతో పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం బాబా ఆలయంలో చందనలేపంతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసా నాగేశ్వరరావు దంపతులు సాయిబాబాకు విశేష పూజలు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా జరిగే రాములోరి కళ్యాణం రోజున సాయిబాబాకు చందనోత్సవం నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా ధూళిపాదుకలకు సుగంధభరితమైన చందనాన్ని భక్తులు సమర్పించారు. బాబాకు చందనం అర్పిస్తే పాపాలు, కష్టాలు తొలగిపోతాయని, బాబా అనుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అనంతరం భక్తులకు వడపప్పు, పానకం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండు తాతరాజు, కోన సత్యనారాయణ, పసుపులేటి వెంకట్రావు, దుంగ ప్రసాద్, బాబా హారతి బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అర్తమూరులో ఘనంగా శ్రీ రామనవమి వేడుకలు



**మండపేట. పెన్ పవర్.మార్చి 27 :** శ్రీరామనవమి సందర్భంగా అర్తమూరులో వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని గణపతినగరం వద్ద వేంచేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, పద్మావతి దంపతులు, నల్లమిల్లి మణిధరరెడ్డి, సౌందర్య దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 27 :** జగ్గంపేటలో శుక్రవారం మెగా పవర్ స్టార్, గ్లోబల్ స్టార్ కొణిదెల రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట రామ్ చరణ్ ఫాన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ప్రసాద్, ప్రెసిడెంట్ జగదీష్, వైస్ ప్రెసిడెంట్ నాగు, సెక్రటరీలు వినయ్, దుర్గ ఆధ్వర్యంలో జగ్గంపేట సెంటర్లో ప్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీన్మార్ డప్పులు, అభిమానుల కోలాహలం, బాణాసంచా కాల్పుల మధ్య భారీ కేకును కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. జై మెగా పవర్ స్టార్ అంటూ నినాదాలతో జగ్గంపేట సెంటర్లో అభిమానులు సందడి చేశారు. తమ అభిమాన హీరో రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రత్తిపాడు కాపుల రామాలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా
- యాళ్ళ జగదీష్,మంగా దేవి దంపతులకు పట్టు వస్త్రాలు బహుకరణ





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్ మార్చి 27:** నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని శ్రీ సీతారాముల వారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ధర్మవరం రోడ్డులో ఉన్న కాపుల రామాలయంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు నియోజకవర్గం సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్,ఎమ్మెల్యే సత్యప్రభ రాజా ప్రధాన అనుచరుడు యాళ్ల జగదీష్ దంపతులతో శ్రీసీతారాముల కళ్యాణం వేద పండితులు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పీటలు మీద కూర్చున్న జగదీష్,మంగాదేవి దంపతులకు ఎమ్మెల్యే పట్టు వస్త్రాలను బహుకరించి ఆశీర్వదించారు.సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తిలకించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్బంగా ప్రత్తిపాడు గ్రామ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని రాములవారిని కోరుకున్నట్లు యాళ్ల జగదీష్ తెలిపారు.జగదీష్ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కనులారా తిలకించి,సీతారాముల వారిని దర్శించుకుని ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రహదారి ఆక్రమణలు తొలగించాలంటూ అధికారులకు ఆదేశాలు






ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం పెన్ పవర్ మార్చి 27:**రావులపాలెంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీఎస్పీ సుంకర మురళీమోహన్, హైవే పీడీ బి. కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎమ్మార్వో ముక్తేశ్వరరావు తదితరులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రహదారి ఆక్రమణలే ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. వెంటనే ఆక్రమణలను తొలగించి, రహదారులను విస్తరించాలని అధికారులకు ఆదేశించారు. సర్వీస్ రోడ్లను వెడల్పు చేసి, అవసరమైన చోట డ్రెయిన్లు నిర్మించి ప్రజలకు సౌకర్యవంతంగా మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్టాండ్‌ను ఇతర ప్రదేశానికి తరలించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష అనంతరం ఎమ్మెల్యే అధికారులతో కలిసి రహదారి ఆక్రమణలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కె.వి. సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉపాధ్యాయుల సమస్యలకు ఎమ్మెల్యే స్పందన





శ్రీరామనవమి సందర్భంగా బండారు సత్యానందరావుకు ఘన సత్కారం

కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి పత్రం

టీచర్ సమస్యల పరిష్కారానికి హామీ కోరిన నాయకులు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 27;**శ్రీరామనవమి సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు,ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఈదల సత్తిబాబు ను కాపు టీచర్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కీలక సమస్యలైన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఈటి), పి.ఆర్.సి. తదితర అంశాలపై వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఉపాధ్యాయుల ఉద్యోగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపించాలని కోరారు. అనంతరం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్వ ప్రధాన కార్యదర్శి అడపా శ్రీనివాస్,గౌరవ అధ్యక్షుడు కటకం శివశంకర్, కార్యదర్శులు బండారు నారాయణ, సలాది శ్రీనివాస్, చీమల నాగేశ్వరరావు, ధర్మరాజు, రామచంద్రరావు, వాసుకి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గెద్దనాపల్లిలో మొదలైన మహిళా భజన పరిషత్ పోటీలు

-- 4 రోజులపాటు సాగనున్న భజన పోటీలు



**కిర్లంపూడి,పెన్ పవర్, మార్చి 27:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో కొత్తపేట రామాలయంలో 5 వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా భజన పరిషత్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు 4 రోజులు సాగుతాయని,5 వ రోజు ఈ నెల 31 న భజన పోటీల్లో విజేతలగా నిలిచినవారికి బహుమతులు ప్రధానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వన్నెపూడి గ్రామానికి చెందిన నంది అవార్డు గ్రహీత పి ఎస్ రామకృష్ణ వ్యవహారిస్తారని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎస్సై జి సతీష్ ,గ్రామ పెద్దలు పంతం సత్య నాగేంద్ర ప్రసాద్,పంతం సురేష్,ఆలయ కమిటీ సభ్యులు సీతాల కొండబాబు,ఆకుల వెంకటేశ్వరరావు,జ్యోతుల దొరబాబు,నాము నాగేశ్వరరావు, ఆకుల సత్యనారాయణ,సాపిరెడ్డి దొరబాబు,ఆకుల సురేష్,ఆకుల నవీన్,ఇనకోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి



**అల్లవరం,పెన్ పవర్,మార్చి 27:**అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలోని చింతలమెరక వద్ద శుక్రవారం పాత రేషన్ వాహనం ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మృతుడు చింతలమెరకకు చెందిన గాద మరిదయ్య(65) గా గుర్తించారు. రెల్లుగడ్డ నుంచి అమలాపురం వెళ్లేందుకు దేవగుప్తం మీదుగా వెళ్తున్న గత ప్రభుత్వంలో రేషన్ పంపిణీ చేసే వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం అయ్యింది. దీంతో మరిదయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న అల్లవరం ఎస్సై బి.సంపత్‌కుమార్ ఘటన స్థలంకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం తరలించినట్లు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు.

## అంగరంగ వైభవంగా శ్రీ రామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం






**రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 27 :** పోలవరం జిల్లాకేంద్రం రంపచోడవరం లోని శ్రీ విరాట్ విజయ ఆంజనేయస్వామి సహిత శ్రీ కోదండరామాలయంలో శ్రీ రామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, పావని దంపతులు కళ్యాణాన్ని నిర్వహించారు. కోదండరామాలయంలో ఆలయ అర్చకులు యజ్ఞసూర్యశాయి కిరణ్ పూజా కైంకర్యాలు నిర్వహించగా, పురోహితుడు పవన్ శర్మ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి కళ్యాణ క్రతువును వైభవంగా జరిపించారు. అనంతరం మధ్యాహ్నం సూరిశెట్టి రామ్మోహనరావు కుటుంబ సభ్యులు అన్నసమారాధన నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వేంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ పల్లాల రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఈశ్వరరాజు దంపతులు, బడిరెడ్డి అబ్బులు, కుంచె సూర్యారావు, రావూరి పుష్కరం, అన్నవరెడ్డి కృష్ణకిశోర్, వెలిశెట్టి వీరభద్ర ప్రసాద్, గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, ఎర్ర ఆనందరావు, లీలా నాగు వీరభద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

★ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.



**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 27:** శ్రీ సీతారాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా మెండుగా ఉండాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. మండలంలోని కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం, తామరాడ, రామచంద్రపురం గ్రామాలలో ఘనంగా నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలతో పాటు కాపుల రామాలయం, కొండయ్యపేట, నరరావుపేట, ఉట్లగుడి సత్య కాలనీ రామాలయాలలో నిర్వహించిన వేడుకలలో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ సీతారాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో గంధం ప్రభాకర్, దాడి చినబుజ్జి, ఎల్లపు దొరబాబు, బోండా నందిబాబు, చిక్కాల భగవాన్, నాగబోయిన శివ, బోండా రమణ, కాయల మణికంఠ, నవీన్, వంశీ స్థానిక జనసేన నాయకులు, జనసైనికులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఈనెల 29న తాళ్లూరులో బిసి ఐక్యత సమావేశం, హాజరుకానున్న జిల్లా, రాష్ట్ర నాయకులు:

**గండేపల్లి, పెన్ పవర్,మార్చి, 27:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఈనెల 29 ఆదివారం బీసీ ఐక్యత సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తాళ్లూరు గ్రామానికి చెందిన వెనుకబడిన తరగతుల సంక్షేమ ససభ్యులు తెలియజేశారు తాళ్లూరు గ్రామంలో బీసీ వర్గానికి చెందిన 12 కులములు వారు కలిసి బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి జిల్లా నుండి వారి కుల పెద్దలు హాజరవుతారని తెలియజేశారు,. గండేపల్లి మండలానికి చెందిన చుట్టుపక్కల గ్రామాల బీసీ కుల పెద్దలు, నాయకులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

## కిర్లంపూడి పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న తోట వరుణ్.



**కిర్లంపూడి,పెన్ పవర్,మార్చి 27:**మండల కేంద్రమైన కిర్లంపూడితోపాటు చిల్లంగి, జగపతినగరం పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కిర్లంపూడి, చిల్లంగి,జగపతినగరం గ్రామాల్లో ఉన్న పలు రామాలయాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్ కుమారుడు తోట వరుణ్ సందర్శించి శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని కనులారా తిలకించారు. ఈ సందర్భంగా తోట వరుణ్ మాట్లాడుతూ శ్రీ సీతారాముల ఆశీస్సులు ప్రజలు అందరిపైనా మెండుగా ఉండాలని కోరారు. ఆయన వెంట కొడేల నల్లబ్బాయి, కపిలవాయి సూరిబాబు, ఆడారి నానాజీ, లక్కోజు కోటి,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్సీబీకి దెబ్బ మీద దెబ్బ: ఆరంభ మ్యాచ్‌కు ముందే మరో స్టార్ బౌలర్ దూరం





**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొన్ని గంటల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ అట్టహాసంగా ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచులో తలపడనున్నాయి. ఈ తరుణంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బౌలర్ నువాన్ తుషార టోర్నీ ప్రారంభ మ్యాచుకు దూరమయ్యాడు. ఫిట్‌నెస్ పరీక్షల్లో విఫలం కావడంతో నువాన్ తుషారకు శ్రీలంక క్రికెట్ ఎన్ఓసి (చీూజ) నిరాకరించింది. దీంతో అతడు ఐపీఎల్ తొలి మ్యాచుకు అందుబాటులో ఉండే అవకాశం లేకుండాపోయింది. శ్రీలంక క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ యాష్లే డి సిల్వా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఐదు వేర్వేరు ఫిట్‌నెస్ పరీక్షల్లో 29 పాయింట్లకు గాను పాస్ స్కోరు (17)ను సాధించడంలో తుషార ఫెయిల్ అయ్యాడని తెలిపారు. దీంతో అతడికి ఐపీఎల్?లో ఆడేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు అతడికి ఎన్వోసీ నిరాకరించింది. ఇప్పటికే ఆర్సీబీ ప్రధాన బౌలర్ యశ్ దయాల్ వ్యక్తిగత కారణాలతో టోర్నీ నుంచి వైదొలిగాడు. మరో స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ గాయపడటంతో అతడు ఆడతాడా లేదా అన్న అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ సమస్యల కారణంగా నువాన్ తుషార దూరం కావడం ఆర్సీబీకి భారీ ఎదురు దెబ్బేనని అంటున్నారు విశ్లేషకులు. అయితే, మరో ఐదు రోజుల్లో ఫిట్?నెస్ నిరూపించుకునేందుకు అతడికి మరో అవకాశం ఇస్తారు. ఈసారి కూడా ఫెయిల్ అయితే మాత్రం తుషార మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యే ఛాన్స్ ఉంది. ప్రారంభ మ్యాచుకు తుషార కూడా దూరం కావడంతో అతడి స్థానంలో న్యూజిలాండ్ స్టార్ పేసర్ జాకబ్ డఫీ బరిలోకి దిగొచ్చు.

# నేటి నుంచే ఐపీఎల్-2026... కొత్త ఫీచర్లతో లైవ్ స్ట్రీమింగ్... ఎక్కడ, ఎలా చూడాలంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డిజిటల్ ప్రసార హక్కులను దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేయనుంది. ఈసారి జియోహాట్‌స్టార్‌లో ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లోనూ కామెంట్రీ అందుబాటులో ఉంటుంది. అదనంగా బెంగాలీ, భోజ్‌పురి, హర్యానీ భాషల్లోనూ ఫీడ్స్ ఉంటాయి. మొబైల్ యూజర్ల కోసం ప్రత్యేకంగా వర్టికల్ లైవ్ ఫీడ్, 360-డిగ్రీ వ్యూ, మల్టీ-క్యామ్ ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. రెండు నెలలకు పైగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించనున్న ఈ టోర్నీ మే 31న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్ రోజులు ఉన్నాయి. డబుల్ హెడర్ ఉన్న రోజుల్లో మొదటి మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు, రెండో మ్యాచ్ యథావిధిగా రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం జరిగే మ్యాచ్‌లకు 7:00 గంటలకు టాస్ వేస్తారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న పది జట్లు గ్రూప్ స్టేజ్‌లో ఒక్కోటి 14 మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్ ఫార్మాట్‌లో ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ మ్యాచ్‌లను దేశవ్యాప్తంగా 12 ప్రధాన నగరాల్లో నిర్వహించనున్నారు. ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్ నగరాలు ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న విండీస్ స్టార్ ప్లేయర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఓపెనర్ ఎవిన్ లూయిస్ తీసుకున్న యూ-టర్న్ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కలేదన్న ఆవేదనతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన లూయిస్, ఇప్పుడు మళ్ళీ ప్యాడ్లు కట్టుకుని మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు.

లూయిస్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడమే కాకుండా, ఒక సంచలన ప్రకటన కూడా చేశాడు. కేవలం వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) క్రికెటర్‌గానే ముద్రపడిన అతడు, తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు టెస్ట్ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇందులో భాగంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో జట్టు తరఫున నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌తో తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు.

**లూయిస్ కెరీర్ హైలైట్స్:**

వన్డేలు: 67 మ్యాచుల్లో 2175 పరుగులు (5 సెంచరీలు).

టీ20లు: 65 మ్యాచుల్లో 1782 పరుగులు (2 సెంచరీలు).

కీలక రికార్డు: అంతర్జాతీయ క్రికెట్‌లో 176 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన ఏకైక ఆటగాడు.

టీ20 స్పెషలిస్ట్: విండీస్ తరఫున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (125లి పరుగులు) సాధించిన రికార్డు ఇతడి పేరిటే ఉంది.

# ఫ్లాప్ హీరోయిన్స్ ని పట్టుకున్న అనిల్ రావుపూడి.. ఫేట్ మార్చేనా?

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రస్తుతం ఒక క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టారు. వెంకటేష్, కల్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం అనిల్ ఎంచుకుంటున్న హీరోయిన్ల పేర్లు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఫామ్‌లో లేని హీరోయిన్లను తన సినిమాలోకి తీసుకోవడం ద్వారా వారికి మళ్ళీ హిట్ ట్రాక్ ఎక్కించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి ఈ 'హిట్ మెషీన్' చేతిలో పడ్డాక ఆ ముద్దుగుమ్మల జాతకాలు మారతాయో లేదో చూడాలి.

**వెంకీ సరసన 'మహానటి'.. క్రేజీ కాంబో!:**

ఈ మల్టీస్టారర్ సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ పేరు బలంగా వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా నటించలేదు, కాబట్టి ఈ కాంబినేషన్ ప్రేక్షకులకు చాలా కొత్తగా ఉంటుందని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. నిజానికి కీర్తి సురేష్‌కు ఈ మధ్య కాలంలో సరైన హిట్లు లేవు. ఇటీవల వచ్చిన 'ఉప్పుకప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఇలాంటి టైమ్‌లో అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ రావడం కీర్తి కెరీర్‌కు ఒక పెద్ద ప్లస్ పాయింట్ అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కల్యాణ్ రామ్ జోడీ ఎవరు? కృతీనా.. కయాదునా?:**

ఇక మరోవైపు ఇదే సినిమాలో నందమూరి కల్యాణ్ రామ్ సరసన నటించే హీరోయిన్ కోసం ఇద్దరి పేర్లను



పరిశీలిస్తున్నారట. ఒకరు 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి కాగా, మరొకరు కయాదు లోహర్. కృతి శెట్టి కెరీర్ మొదట్లో వరుస హిట్లు అందుకున్నప్పటికీ, ఈ మధ్య కాలంలో ఆమెకు ఒక్క సాలిడ్ హిట్ కూడా తగలలేదు. అటు కయాదు లోహర్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. వీరిద్దరిలో అనిల్ ఎవరిని ఫైనల్ చేసినా, వారికి ఒక అదిరిపోయే కమ్‌బ్యాక్ మూవీ దొరికినట్టేనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఇప్పటికే మీనాక్షి చౌదరి లాంటి హీరోయిన్ కి తన సినిమాల ద్వారా మంచి సక్సెస్ను అందించారు. ప్రస్తుతం ఈమె వరుస సినిమాలలో అవకాశానందుకుంటూ దూసుకు పోతోంది. ఇక ఇప్పుడు మళ్లీ అనిల్ రావిపూడి కొత్త సినిమాలో ఈ హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నాయి. కాబట్టి వీరి ఫేట్ మారుతుంది అనే కామెంట్లు వ్యక్తమవుతున్నాయి

**అనిల్ రావిపూడి అంటేనే 'హిట్' గ్యారెంటీ:**

ఇకపోతే అనిల్ రావిపూడి సినిమాలంటేనే మినిమం గ్యారెంటీ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. పటాస్ నుండి మన శంకర వర ప్రసాద్ వరకు ఆయన ఫ్లాప్ ఎరగని దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. హీరోయిన్లను చాలా ఎనర్జిటిక్‌గా, బబ్లీగా చూపించడంలో అనిల్ స్టైలే వేరు. అందుకే హిట్ కోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న హీరోయిన్లకు అనిల్ సినిమా ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేస్తే, సక్సెస్ ఆటోమేటిక్‌గా వారి ఖాతాలో పడిపోతుందని టాలీవుడ్‌లో ఒక గట్టి నమ్మకం ఉంది.

**2027 సంక్రాంతికి అసలు మజా:**

ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్ల విషయంలో ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, లీక్ అవుతున్న పేర్లు మాత్రం అంచనాలను పెంచేస్తున్నాయి. 2027 సంక్రాంతి రేసులో నిలవనున్న ఈ మూవీతో వెంకీ, కల్యాణ్ రామ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ఫామ్‌లో లేని హీరోయిన్ల ఫేట్ మార్చడంలో అనిల్ రావిపూడి మరోసారి సక్సెస్ అవుతారని అభిమానులు ఆశిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



కృతి శెట్టి రీగల్ గ్రీన్ లుక్ ప్యూర్ పర్ఫెక్షన్



సంయుక్త మీనన్ యొక్క బోల్డ్ చీర లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com